# ఓటమి గెల్చిన వేళ

**పుట్టగోచీ పెట్టుకొని, పేడ కళ్లు ఏరుతున్న నాటినుండీ చూస్తోంది దాలి - అబగా, ఆశగా, ఆశ్చర్యంగా - ఆ దృశ్యాన్ని. పశువుల మందలు వెళుతూ వుంటాయి గోర్జ లోంచి. పేడతట్టలు పట్టుకొని ఓ అరడజనుమంది గుంటలు పశువుల వెనకాతలే నడుస్తుంటారు.**


అవి వేసే పేడకోసం బోలెడు జట్టీలు. కాని అవి ఒక్క క్షణమే. మళ్ళీ అంతా మామూలుగా, ఏంవీజరగనట్టు కల్సిపోతుంటారు. గోచీలు, చింపిరితలలు, మట్టికొట్టుకుపోయి, ఎండలకు వానలకు మాడి మసకబారిపోయిన శరీరాలు - ఆ పేడగుంటల్నీ, పశువులకాపర్లనీ చూస్తుంటే - వీళ్లు మనుషులేనా అనిపిస్తుంటుంది. ముఖ్యంగా చౌదరిగారి లోగిల్లోకి వచ్చిపోయే నాజూకైన మనుషుల్ని, వారి ఖరీదైన బట్టల్ని గమనించినప్పుడు మరింతగా అనిపిస్తుంది.

ముందుకు సాగుతుంటుంది మంద. గోర్జలోని ఎఱ్రమట్టి గోధూళిగా పైకి లేచి పారదర్శకమైన వస్తువు ద్వారా ప్రపంచాన్ని చూస్తున్న అనుభూతిని కలిగిస్తూ వుంటుంది. పేడగుంటలూ, వాళ్ల తట్టలూ స్పష్టాస్పష్టంగా కనిపిస్తూ వుంటాయి. గోర్జ మలుపు తిరిగే జాగా దగ్గరవుతూ వుంటుంది. మలుపు తిరిగీ తిరగ్గానే ఎవరూ వూహించని రీతిలో, చూసే వాళ్లని సంభ్రమాశ్చర్యాల్లో ముంచే రీతిలో - దర్శన మిస్తుంది చౌదరిగారి కొత్త భవంతి. కాంక్రీటు శ్లేబ్ నిర్మాణమే అయినప్పటికీ, బంగళా పెంకుతో నిర్మించిన భవంతిలా భ్రమకలిగించే సుందరమైన మోడర్న్ బిల్డింగు. గుడిసెల్తప్ప వేరోటి తెలియని గొడ్లకాపర్లకీ, పేడ గుంటలకీ అదేదో దేవేంద్ర భవనంలా కనపడ్డంలో ఆశ్చర్యం లేదు. అందుకే గోర్జ మలుపులో భవంతి కళ్ల పడగానే, వాళ్ల నడకలు మందగించిపోతాయి, భవంతిని మరోసారి మరోసారి తదేకంగా చూసే ధ్యాసలో. ఎకరన్నర స్థలంలో నిర్మించిన బంగళా. బంగళా చుట్టూ రకరకాల మొక్కలు. లోపలికి చొరబడ్డానికి వీల్లేకండా మాంచి పకడ్బందీగా కట్టిన యినప ముళ్ల తీగ.

మంద ముందుకి సాగుతూనే వుంటుది. కాని గుంటలంతా నాలుగడుగులు వెనక్కి దిగబడపోతారు. దిగబడిపోయి కంచె దగ్గర నిలబడి తదేక ధ్యానంతో లోపలున్న స్వర్గాన్ని చూస్తుంటారు కళ్లార్పకుండా.

భవంతి పోర్టికోలో ఖరీదైన కార్లు. మడతలు నలగని బట్టల్తో, వేళ్లనిండా వుంగరాలతో, నునుపైన శరీరాలతో ఎవళ్లెవళ్లో పెద్దమనుషులు నిత్యం వస్తూంటారు. చౌదరిగార్ని కల్సుకోడానికి. వాళ్లతో కరచాలనాలు చేస్తూ, చిరునవ్వులు చిందిస్తూ, నెమ్మదిగా పలకరిస్తూ; ఎడ్వర్టయిజ్‌మెంటు ఫిగర్లా నీట్‌గా ఫుల్ సూట్లో కనిపిస్తుంటారు వీరేంద్ర చౌదరిగారు. ఆయన తెలుగువాడే కాని యాసగా మాట్లాడతాడు తెలుగుని. తమిళ రాష్ట్రంలో స్థిరపడిన తెలుగు పారిశ్రామికవేత్త వాళ్ల నాన్నగారు. అక్కడనుండి యితగాడు ఆంధ్రదేశంలోని యీ మారుమూల వెనకబడిన జిల్లాకి, అందులోనూ వూరూపేరూ బొత్తిగా లేని

ఎ.వి. రెడ్డిశాస్త్రి



యీ కుగ్రామానికి తరలివచ్చి, గ్రానైట్ పరిశ్రమని స్థాపించి, కొండల్ని పిండి (చేస్తూ), డబ్బు సంపాదిస్తున్నాడు పుష్కలంగా.

"వూరవతల బయిలు జాగాలో మేడ కట్టుకొని వుంతన్నాడుగదా - రాత్రిల్లప్పుడు బయింవెయ్యదేటో!" అని ఆశ్చర్యపోతూ వుండేవాళ్లు పశువుల కాపరి గుంటలు, కంచె దగ్గర నిలబడి భవంతిని తదేక ధ్యానంగా చూస్తూ వాళ్లల్లో కాస్త పెద్ద వయస్సున్న కుఱ్ఱాడొకడు, తన సహచరుల అజ్ఞానానికి నవ్వి యిలా వివరణ యిచ్చేడు: "మీకు తెల్దేటఱ్ఱా, ఆ లోగిల్ల నాలుగు బేపులున్నాయని, (dogs). అందల మరీ ముక్కెంగ కఱ్ఱిబేపి (black dog) ఒకటున్నాది సూసినా, అదొక్కటే సాలు, లోపుల కడుగెట్టినోడ్ని సంపితినీనానికి."

"అదన్నమాట! బయిం నేకంట కాపలాకి కుక్కలున్నాయి. ఆటికి తోడు కాకీ బట్టల్తొడిగి, టుపాకీ సేత్తోపట్టుకొని గేటు కాడ గుర్కావోచ్‌మేను తైనాతు కూకొనే వుంటాడు. యీగనేన లోపలికి పోనివ్వకంట సూస్తూ" అని సంతృప్తిపడి తలలూపుతారు వింటున్న వాళ్లంతా.

మిగిలిన గుంటలందర్దీ ఒకధ్యాసయితే, దాలిగుంటది మరో ధ్యాస. "ఎన్ని మొక్కలో, ఎన్ని పూవ్వులో' ' అని మూతి మీద వేలువేస్కొని, ఆశ్చర్యపోతూ అలానిలబడిపోయింది దాలి ఆబగా, ఆశగా, లాలనగా ఆ పువ్వుల్ని చూస్తూ జారిపోతున్న గోచీ, చింపిరిజుట్టు, చేతిలో పేడతట్టా వుంటేనేంగాక, దాలిమాత్రం చక్కనిచుక్క. దానికే గాని స్తానంపోసి, మంచిబట్టల్తొడిగి, జుట్టు దువ్వి, బొట్టు పెట్టి - కంచకివతల నిలబెడితేనా - అంత అందమైన తోటా దిగాలుపడి, చిన్నబుచ్చుకొని వుండదూ దాలి వైపు చూసి, అయితే అటువంటి పరిస్థితి లేదు కనక పువ్వులే పైచెయ్యి- అంచేత అవి గర్వంగా చూస్తుంటాయి దాలిని. ఆ పువ్వుల్ని ఆరాధిస్తున్నట్టుగా చూస్తూంటుంది దాలి.

"ఏటే, పేడ మరింటి కొట్టి కెల్లనా? సిల్లంగెట్టీ దాన్లా అలారోజూ ఆ పువ్వుల్ని సూస్తుంటావు కదా- ఏటొస్తాదే నీకు" అని తతిమ్మా పేడగుంటలు దాలిని హెచ్చరిస్తూ వుంటారు, దాన్ని మళ్లీ యీ లోకంలోకి తేవడానికి. పేడని పోగు చెయ్యడం కంటే మరింత ముఖ్యమయిన విషయం వాళ్ల వూహకి తట్టదు. అంచేత దాలి బాధ వాళ్లకి అర్థం కాదు..

దాలితండ్రి కోనారికి ఓ గుడిసుంది. చౌదరిగారి భవంతిని మెయిన్ రోడ్డుకు కలిపే గోర్జమొగనే వుంది వాడి గుడిసె. దాని ముందు ఓ రెండు దోసిళ్ల ఖాళీజాగా వుందో, లేక దాలే దాన్ని ఆక్రమించి తన స్వాధీనంలోకి తెచ్చుకుందో తెలీదు. కాని గుడిసెముందున్న ఆ కాస్త జాగాని శుభ్రం చేసి, నాలుగంటే నాలుగే బంతిమొక్కల్ని నాటింది. ఆ నాలుగు బంతి మొక్కలూ నాలుగు రకాల బంతిపూలని పూస్తుండేవి. అంతంత పెద్దవిగా, అంతంత నాడుగా, అంత అందంగా పూచే బంతి పూలని ఆ పల్లెటూరి జనాలు ఏనాడూ చూసి వుండలేదు.

"సూడే సోద్దెం(చోద్యం)- ఆ దాల గుంట గుడిసి ముంగట బంతిపూలు సూసినా? అనాటి అందcమైన పువ్వులు మన మడకలింట ఏనాడేన పూచినాయేటీ? ఎరువులూ, గుండలు బస్తాలకి బస్తాలు సల్లింపిస్తాడు కదా- అనాటి సౌదరిబాబు యింటిముంగట్ల పూసిన బంతి పువ్వులన్నీ గుంట పువ్వులే. మరీ గుంటపాప యేటేస్తందో ఏటోగాని" అని ఆశ్చర్యపడుతూ వుండేవారు. గుడిసెముందునుండి నీళ్లకి వెళ్లే ఆడంగులు, వాళ్ల మాటలు విని మురిసి పోయేది దాలి. "చౌదరి బాబు గారింట్లో కంటే తన ముంగిట్లో పూచిన పూలే బాగున్నాయట!" ఎవరికి తెలుసు- ఆ మొక్కలికి పోసే ప్రతినీటి చుక్కని తన అనురాగామృతంతో రంగరించి మరీ పోస్తోందని!

* * *



కాలం చకచకా నడుస్తోంది. చౌదరిగారి సామ్రాజ్యం విస్తరిస్తోంది అలా అలా. గ్రానైట్స్ ఫ్యాక్టరీ పక్కనే రాయిక్రషర్ మిల్లు.. పలకలకి పనికిరాని రాళ్లు క్రషర్స్ నోట్లో పడి, కరకర నమలబడి కాంక్రీటుకి అనవసరమైన చిప్స్‌గా మారిపోతున్నాయి. చేత్తో రాళ్లని కొట్టేవాళ్లు వాళ్ల వృత్తులు పోవడంతో చౌదరిగారి క్రషర్స్ దగ్గర కూలీలుగా చేరేరు. చుట్టూ మరికొన్ని మిల్లులు లేచేయి. దానివల్ల ఎటుజూసినా ధూళి, పొగ, శబ్దకాలుష్యాలే. ఆ పొగల మధ్యని మాడుతున్న శలభాల్లా కూలీలు.

మిల్లుల్తో ఆగిపోకుండా, చౌదరిగారు రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో కూడా అడుగు పెట్టారు. వూరిచుట్టూ వున్న పొలాలు ఏనాడూ పంటల్ని పెద్దగాపండించిందిలేదు, వర్షాధారాలు అవడంవల్ల, చౌదరిగారు ఏక మొత్తంలో యీ పొలాలన్నింటినీ బక్క రైతుల్నుండి కొనేసి, యిళ్ల స్థలాలకింద లేఅవుట్లు చేసి అమ్ముతున్నారు. గ్రామానికి దగ్గర్లో వున్న పట్నంలో నిలబడ్డానిక్కూడా జాగా దొరకని పరిస్థితి వుందేమో- అక్కడ్నుంచి వచ్చిన జనాలు ఎగబడి చౌదరిగారిలే అవుట్ స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. పొలాల్ని అమ్మివేసుకున్న రైతులు కూడా ఆయన ఎస్టేట్లలో కూలీలుగా కుదురుకున్నారు.

* * *

దాలి పేడకూడ వెయ్యడానికి వెళ్లడం మానుకుంది. అదిప్పుడు చిన్న పిల్లకాదు కదా! పసి వయస్సులోనుండీ అది రూపసే, కాని వయసుతోపాటు కొత్తగా పరుగెత్తుకొచ్చిన అందచందాలు అన్నీ యిన్నీ కావు, దాని వైపు చూస్తే చాలు- దానివి చూసిన కళ్లతో, మళ్లీ మరి దేన్నీ చూడాలని అనిపించదు.

దాలి తన పాత అలవాటుని మార్చుకోలేదు. రోజూ కాకపోయినా, అప్పుడప్పుడు గోర్జ రోడ్డు మీదుగా ధీమాగా, నింపాదిగా, ఓ మహారాణిలా నడిచి వెళుతుంది చౌదరిగారి భవంతి దాకా. గోర్జని యిప్పుడు చౌదరిగారు తారురోడ్డుగా మార్పించేయడం వల్ల, పూర్వం రోజుల్లో కనిపించే గోధూళి దృశ్యం అదృశ్యమైపోయింది. పశువుల్ని కూడా ఈ రోడ్డున వెళ్లకుండా కట్టడి చేసేరు. దాలి రోజుల్లో అయితే గోధూళి పొరల్లోంచి కనిపించే ఆయన భవనం ఏదో స్వప్న భ్రాంతిని కలిగిస్తూవుండేది. ఇప్పుడదంతా పోయి, ఆ బంగళా భయంకరంగాను కాపలాకుక్కలు కాలభైరవుల్లాగనూ కన్పిస్తుంటాయి వుండుండి. అయితే, దాలికివేమీ పట్టవు. దాని దృష్టల్లా పూలమళ్లమీదా, అందులోవున్న మొక్కల మీదా, ఫెన్సింగు దగ్గర నిలబడి, నిశ్చలంగా, తదేక ధ్యానంతో పూలమళ్లని చుస్తున్న దాలికేసి చూస్తే, వనదేవత అక్కడ నిలబడి అందంవైన తన సృష్టిని పర్యవేక్షిస్తున్నట్టుగా అనిపించేది. మొత్తం పువ్వుల మడంతా ఒక ఎత్తయితే, మడి మధ్యగా నీలిమేఘం రంగులో, రాజ హంసలా ఠీవిగా నిలిచిన నీలిగులాబీ మొక్క ఒక్కటే ఒక ఎత్తు. ఆ పువ్వుమీద దృష్టి నిలిపి, విశ్వంలో తన వునికినే మర్చిపోయి, పరవశించి పోతున్నట్టు కనిపించేది దాలి.

* * *

> శిలా ప్రతిమలా నిలబడి ఆ కిరాతకాన్నీ, విధ్వంసకాండనీ, వీక్షించింది దాలి పూలమొక్కల కుదుళ్లమీద పారలు, పలుగులు విలయ తాండవం చేస్తుంటే, కూకటి వేళ్లతో తన అస్తిత్వాన్నే ఎవరో పెల్లగిస్తున్నట్టుగా గిలగిలాడి తన్నుకుంది దాలి, అయితే, యింతటి బాధనీ, యింతటి దుఃఖాన్నీ కొండంత నిబ్బరంగా నిలబడి ఓర్చుకుంది కూడాను.

ఇంతలో హైద్రాబాదునుండి చౌదరిగారి ఆప్తమిత్రుడొకాయన రావడం తటస్థించిందావూరు - తన మిత్రుడి సామ్రాజ్యం చూడాలనిపించి కాబోలు అయితే వచ్చినవాడు వచ్చినట్లే వెళ్లకుండా, చౌదరిగార్లో ఓ చిన్న ప్రలోభపు బీజాన్ని నాటి మరీ వెళ్లేడు. "ఇక్కడి వాతావరణం కూడా అనాబ్ షాహీ ద్రాక్షకి అనుకూలంగా వుండేలా కనిపిస్తోంది. ఈ పువ్వులూ, ఆకులూ, క్రోటన్స్‌లూ కూడు పెట్టేనా, గుడ్డ పెట్టేనా, ఖర్చే తప్ప. అంచేత ప్రయత్నించి చూడకూడదూ?" అదీ అతడు నాటిన ప్రలోభపు బీజం.

రాబడి వస్తుందని ఆశకలిగితే, యిహ చౌదరిగార్ని ఆపటం బ్రహ్మతరంకాదు. వెంటనే రంగంలోకి దిగేడాయన. క్రోటన్స్ మొక్కలనీ, పూలమళ్లనీ నిర్దాక్షిణ్యంగా నరికించి పారేశాడు. శిలాప్రతిమలా నిలబడి ఆ కిరాతకాన్నీ, విధ్వంసకాండనీ వీక్షించింది దాలి. పూలమొక్కల కుదుళ్ల మీద పారలు, పలుగులు విలయతాండవం చేస్తుంటే, కూకటివేళ్లతో తన అస్తిత్వాన్నే ఎవరో పెల్లగిస్తున్నట్టుగా గిలగిలలాడి తన్నుకుంది దాలి. అయితే, యింతటి బాధనీ, యింతటి దుఃఖాన్నీ కొండంత నిబ్బరంగా నిలబడి ఓర్చుకుంది కూడాను.

తవ్వేసిన మొక్కల్ని ఫెన్సింగ్ మీంచి గోర్జలోకి విసిరిపారేస్తున్నారు కూలీలు. దాలికి ప్రాణానికి ప్రాణమైన నీలిగులాబీ మొక్క కాకతాళీయంగా వచ్చి దాని కాళ్లదగ్గరే పడింది. వనలక్ష్మిని నిలువునా చీల్చి తనకాళ్లముందు పడేసినట్టనిపించింది దాలికి. మెల్లగా వంగి, ఆర్తిగా, ఆప్యాయంగా, ఆత్మీయంగా - గాయపడి తన్నుకుంటున్న బిడ్డని తీసి ఎత్తుకున్నట్టు - ఆ మొక్కని తీసి పట్టుకుంది. గులాబీ మొక్కకున్న ప్రతిముల్లులోంచీ రక్తం చిందుతున్నట్టనిపించింది దాలికి.

ఆ మొక్కని తీస్కొని సరాసరి గుడిసెకి తిరిగి వచ్చేసింది. చల్లని నీటితో కొమ్మలగాయాల్ని కడిగి పేదదీర్చింది. తరవాత కాస్త నీడగా వున్న జాగా చూసి, సొమ్మసిల్లిపోయిన ఆ కొమ్మనివాటి, - "ఏడుపు ఆపి ఎదురుగా వున్న బంతి మొక్కల్తో వూసులు చెప్పుకోమని" బుజ్జగించింది.

దాలి ముద్దుచేస్తుంటే, లాలిస్తూ వుంటే, క్రమేపి నీలిగులాబీ కోలుకుని, బొద్దుగా ఏపుగా పెరిగింది. దాలి కురిపించే ప్రేమామృతంలో తడిసి, నును సిగ్గులు పోతూ రమ్యంగా మొగ్గతొడిగింది. తన ముంగిటి, తన మట్టిగోడల గుడిసె కభిముఖంగా అరుదైన ఆ నీలిగులాబీ తొలి పువ్వుని పూచిన్నాడయితే, దాలి యిహ భూమ్మీద నిలబడ్లేదు. కపోతంగా మారి ఆనందగగనంలో పరుగులు తీస్తున్నట్టు గుడిసెచుట్టూ, మొక్కలచుట్టూ ఆలంగం తిరిగింది. కూతురి వెర్రి ఆనందాన్ని చూసి, మరోలా అర్థం చేస్కొని "దీనికి బేగి పెళ్లిసేసేయాలి. నేకపోతే పిచ్చిదయిపోయేటట్టుంది" అనుకున్నాడు కోనారి.

* * *

బంగళా ఆవరణలో ద్రాక్ష అవలేదు సరికదా, మొక్కలూ, పూలచెట్లు నరికెయ్యడంతో, శ్మశానవైభవం సంతరించుకుంది చౌదరిగారి భవంతి. బంగళానుంచి ఎటు పక్కచూసినా ఫ్యాక్టరీ గొట్టాలు వదిలే

పొగలు, క్రషర్లు చేసే కఠోరమైన కరకర శబ్దాలు, యివే దృశ్యాలిప్పుడు. పొగలయితేనేం, సెగలయితేనేం డబ్బొచ్చి పడుతోంది కదా అని తృప్తిగా విష్కర్స్ సవిరించుకుంటారు చౌదరిగారు.

చౌదరిగారి మనస్సుని ఓ చిన్నగ్లాని పట్టి పీడిస్తోంది చాలాకాలంగా మొదట చాలా చిన్నదిగా ప్రారంభమయిన ఆ బాధ రానురాను కేన్సర్‌లా అతన్ని వేధించడం మొదలెట్టింది. తన భవనానికి తోకగా వుంటుండే మైలు పొడవు గోర్జనీ తారు రోడ్డు క్రింద మార్చి దానికో 'ఎలిగెంట్ లుక్' (elegant look) వచ్చేటట్టు చేశాడాయన. మొత్తం గోర్జనంతట్నీ తన భవనానికి "ఎక్స్‌క్లూజివ్ ఎప్రోచ్"గా సాటి బిజినెస్ వరల్డ్ (Business World) చూపెట్టుకోవాలని ఆయన తహతహ. అయితే ఆ 'డ్రీమ్' నెరవేరకుండా చిన్న అడ్డంకి ఓ గుడిసెరూపంలో వచ్చిపడింది.

గోర్జమలుపు తిరిగి నేషనల్ హైవే అయిదులో(MH5) కలుస్తున్న సంగమ ప్రదేశంలో సరిగ్గా ఆ స్పాట్‌లో - కోనారిగాడి గుడిసె తగలబడింది. అందమైన ముఖం మీద అసహ్యకరమైన కంతులా గోర్జకి తను చేయించిన పక్కా బ్లేక్‌టాప్ రోడ్డు, జాతీయ రహదారిలో కలిసే దృశ్యం ఎలా వుండాలి! అవసరమైతే అక్కడ తనో ఆర్చిని కూడా ఎరెక్ట్ చేయించగలడు. చేయించి "ప్రైవేట్ ఎప్రోచ్ రోడ్డు...." అని యింపోజింగ్ లెటర్స్‌లో తన ఎస్టేట్ పేరు రాయించుకోగలడు. కాని యీ డ్రీమ్ ఫుల్ ఫిల్ కాకుండా, సరిగ్గా ఆ జంక్షన్ దగ్గిరే కోనారి గాడి గుడిసె తగలబడింది.

చివరికి కోనారికి కబురు పంపేడు. ఆగుడిసె వున్న జాగాని వదులుకుంటే, దానికి ప్రతిగా ఎంతో లాభం కలిగేలా మరో దగ్గర మరింత పెద్దజాగా, ఆ జాగాలో గుడిసెవేస్కోడానికి అవసరమైన నగదు నగయిరా యిస్తానని.

ఆ మాట వింటూనే మండిపడింది దాలి. కబురు తెచ్చినవాడ్ని కొట్టినంత పనిచేసింది ఏ జన్మ సంస్కారమో తెలీదుగాని దావినోటంట ఏనాడూ దుర్భాషలు రావు. కాని చౌదరి పంపిన కబురు వినగానే మాత్రం కోపంతో వుడికిపోతూ, చాలా కటువుగా మాట్లాడింది దాలి.

"ఏటేటీ,తన రోడ్డు మెయినురోడ్డుకి కల్సీకాడ అందంగా వుండాలా? అందంవంటే ఏటో తెలుసేటి ఆ సుంచు మొకంగాడికి వల్లగా మెరస్తండే కొండల్ని సూసీ, ఆటి ఎత్తుని సూసీ, నిలకడ్ని సూసీ నిలబడి దణ్ణపెట్టేవోళ్లవా లేదా? ఆటి దుక్కు సూస్తప్పటికి, కళ్లముంగట దేవుళ్లు నిలబడినట్టనిపించేది. మరలాటి కొండ లేటయినాయి యియాళ? అంతంత లేసి కొండల్నీ మందుపాతర్లెట్టి పేలిపించేసి, పలకలూ, రాళ్లూ, కంకరా, యిసకల కింద మార్సీసి, ఆట్నమ్ముకొని నచ్చులకి నచ్చులు గడించి యినప్పెట్ట యేస్కుంటున్న పెద్దమడిసికి యియాల అందం మాట యాదొచ్చిందా? పచ్చని పొలంవంటూ ఎక్కడేనా మిగిల్సినాడా కళ్లారా సూస్కోని సంబర పడదానికంటే? అంతలెక్కా మిల్లులెట్టేసి, అన్ని పొలాల్నీ యిళ్ల జాగాల కింద మార్సీసి - మనూరి మడకల్ని స్మశానాల కింద మార్సీసినోడికి అందం కావల్సొచ్చిందా యియేళ! నాకు తెలకడుగుతాను, అతగాడికి అందంవంటే ఏటో తెల్సేటా?

> దశాబ్దాలు గడిచే కొద్దీ రాజకీయ, వైజ్ఞానిక, సామాజిక రంగాలన్నింటి పరివర్తనలో అమోఘమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ మార్పులన్నీ మనిషి జీవనగతిపై ఆలోచనారీతిపై ప్రభావం చూపిస్తూనే ఉంటాయి.
>
> సమాజంలో, మానవ జీవితంలో వచ్చిన మార్పులే రచయితల భావనలని, ఆలోచనా శక్తిని ప్రభావితం చేస్తాయి. తత్ఫలితంగా రచయిత ఎన్నుకొనే ఇతివృత్తం మారుతుంది. సమస్యల స్వరూపం మారుతుంది. రచనా సంవిధానం మారుతుంది. ఏది మారినా మౌలికమైన సాహిత్యపు విలువలు, జీవితపు విలువలు మారవు. మారని ఈ విలువలున్న కథైనా, నవలైనా మరే ఇతర రచనైనా అది ఏతరం రచయిత రచించినదైనా గానీ సాహిత్యాభిమానుల ఆదరణను చూరగొంటుంది. కాలాతీతమైన విలువల్ని ఆవిష్కరిస్తుంది. అందులో సందేహం లేదు. ఈ విలువల్ని ఎత్తిచూపే ప్రయత్నంలో భాగంగా ఈనాటి కథకుల విలువైన రచనల్ని ఆహ్వానం మీకు అందిస్తోంది.

అందవంటే అంత పడిసచ్చిపోడయితే, తన ముంగట్లున్నతోటని - ఏది - పువ్వుల్తోనే కాయల్తోనీ కలకల్లాడతున్న తోటని - కటికి రాచ్చసుడ్లా ఏల నరికించేసినాడు? అదేదో దయ్యదగొట్టు పంట, దాన్నేసి, డబ్బు గుంజేయాలని కదరా పువ్వుల్తోటని తప్పించిసినాడు!

అన్నారే! గోర్జమన్ది, అది మన వూరి పోరంబోకట పెద్దనాయుడు సెప్పినాడు. ఆనాటి మన గోర్జిని ఆక్రమిచ్చేసి, అందలెల్లి మన పశువులు నడ్డానికి కూడ దోవనేకంట సేసేసి, కంకరా తారు దివిశా కొట్టించి దాన్ని నిగనిగలాడ తన్న రోడ్డు కింద తయారు సేస్కున్నాడు. ఇప్పుడా రోడ్డుని సూసినప్పుడల్లా నాకేటనిపిస్తాదెరికా? ఇది యమదరనరాజింటికెల్లీ రోడ్డని. ఈ రోడ్డెల్లి నరకంలాంటి ఆ పెద్దరోడ్డుని కలిసీకాడ అందం గుండాలని అందవంటే పొగులూ రాత్తిరీ అనకంటె రోజస్తమానం లారీలు, బస్సులు సేసేగోలేనా ఏటిసెప్మా? అవ్వి పరిగెడతుంటే నెగిసేదుమ్ము, అవి గుద్దుకుంటుంటే పచ్చేజనాలు - యీరకం అందవే కావోలు అతగాడిక్కావలసింది!

ఒరన్నా, అతగాడికి తెలకంటుంది గానారే, మాగుడిసిక్కడవున్నాది కాబట్టే, కసింత అందం యిక్కడ మిగిలివున్నారా! నాను పెంచిన బంతిమొక్కలు, క్రిష్ణ తాంవర మొక్కలు, గులాబి మొక్క పువ్వులు పూస్తుంటే ఎంత అందంగుంటాదో ఎరికా? నానేసిన ముగ్గులు, నాసేతుల్తో అలికి యీ గోడలకి నానేసిన జేగురు పట్టీలు - యివి సూస్తుంటే సంకురాత్తిరి (సంక్రాంతి) పండుగంత అందం కనపడతాది. మాగుడిసిని నేలమట్టం సెస్తే మరేటి మిగుల్తాదిక్కడ సీకటితప్ప! ఈ మడవని మిగిలిన యీకసింత పొరగం కూడా పోతే - సివరకి ఆ నరకవే మిగుల్తాదిరా ఒరన్న".

నిత్యంనిండుకుండలా వుండే కూతురు యిలా కార్చిచ్చులా రెచ్చిపోవడం చూసి నిశ్చేష్టుడయిన కోనారి "ఊరుకోయమ్మ, కసింతూరకోయే" అని కూతుర్ని సముదాయించేడు. రాయబారం నడిపిన పెద్దమనిషి క్కూడా దాలి మాటల్లో సత్యం గోచరించింది. మరి సంభాషణ పెంచకుండా అక్కడ్నుంచి లేచి వెళ్లిపోయేడు.

అయితే యీ ప్రతిఘటన ఆట్టేకాలం నిలవలేకపోయింది. ప్రలోభాలు పూర్తయ్యాక బెదిరింపులు ఆరంభంవయాయి. కోనారి


చివరికోనాడు కూతుర్ని కూర్చోబెట్టుకొని యిలా బోధపర్చేడు. "తల్లోలే! అసలు సిక్కేటో ఎరికా? ఇయ్యాల మనవూరు వూరల్లా ఆసౌదరిబాబు సేతిలో సిక్కిపో యింది. వూర్లున్న పొలాలన్నీ ఆకావందు సేతిలో కెల్లిపోనాయి. వూర్లున్న జనాలల్ల ఆయన దివాణంలో కూలీలైపోయి బతక తన్నారు. మనకి తెలవకంట మనవంతా ఆ బాబుకి కట్టుబానిసలవైపోనాం.. ఆయన పెట్టిన మిల్లులు, ప్టేక్టిరీలు పనిజేస్తుంటునే మనకి పొట్టగడుస్తాది. నేకపోతే మన పని పస్తే. అందికని అతగాడు మనకి కూడె డుతున్న మారాజన్నమాట. అయితాకూడు ఎవ గెడతన్నాడూ? ఆయన యింటిముంగల పడున్న బేపులకి కూడెడతన్నట్టే మనకీ యెడతన్నాడు. ఆ కుక్కల్ని సూసుకున్నట్టే మన్నీ (పేమగా సూసుకుంటాడు. సెప్పిదే టంటే, మన బతుకులు కూడా కొసకి ఆ కుక్కల బతుకుల్నాగే అయిపోనాయి. ఆ కుక్కల్ని గొలుసుల్తో కట్టే కూకోబెట్టినట్టే, మన్నీ డబ్బులంకెల్తో కట్టిపడేసినాడు "ఈ విధంగా చౌదరిగారి యిష్టాయిష్టాల్ని ధిక్క రించి బతకలేని తన అశక్తతని కూతురికి బోధపర్చి చెప్పేడు కోనారి.

ఆ విధంగా, వేరే మార్గంలేక, నిస్సహా యస్థితిలో దాలి, దానితండ్రీ, గుడిసెవదిలి వేరేచోట బతుకును పునఃప్రారంభించుకో డానికి నిశ్చయించుకున్నారు.

* * *

వాళ్లు గుడిసెని ఖాళీ చెయ్యడానికి తయారవుతున్న రోజు. నిర్జీవమయిన మర బొమ్మలా అనాసక్తంగా సర్దవలసిన నాలుగు వస్తువులూ సర్ది, గోనెల్లో వేసి, మూతులు బిగించింది దాలి. ఇంతలో బయట కారు ఆగిన చప్పుడు. గుడిసెని స్వాధీనం చేస్కో డానికి వచ్చిన చౌదరి మనుష్యులైయుం టారు. వాళ్లని చూడ్డానికి మనస్కరించక, చప్పున బయటికి రాలేదు దాలి. కాని తడక కన్నాల గుండా వచ్చిందెవరో కళ్ల బడనే పడింది.

పడవంత పల్లనివిదేశీ కారులోంచి చౌదరి కూతురు దిగింది. మెరుపు తీగలాంటి ఆ అమ్మాయిలో అందం మెరుగుకన్న అలంకారాల మెరుగే ఎక్కు వగా వున్నట్టు పసిగట్టింది దాలి. కారు దిగిన అమ్మాయి కులుకుల నడకతో గుడిసెవైపు నాలుగడుగులు వేసి 'ఓ' అని ఇంగ్లీషు వుచ్చారణలో ఆశ్చర్యాన్ని అభినయిస్తూ, తిప్పిన మూతి తిప్పడు చూడగానే దాలికి కిసుక్కున నవ్వాలనిపించినా, తమాయిం



చుకుంది. ఆమెకి అంతటి మహాశ్చర్యాన్ని కలిగించిన వస్తువేదో అర్థమయిపోయింది.

తనతో పాటుగా తీసుకుపోవడానికి మట్టి అరుగుమీద సిద్ధంగా వుంచిన నీలి గులాబీ మొక్కకి పూచిన అరుదైన పువ్వు! మిలమిల మెరుస్తున్న విదేశీకారుని, మెరుపుతీగలాంటి అమ్మాయినీ, చౌదరిగారి సామ్రాజ్యాన్నీ ఆ సామ్రాజ్యం చుట్టూ వల యంలా విస్తరించుకున్న సౌందర్యారాహి త్యాన్నీ ఎద్దేవా చేస్తున్నట్టు కనిపిస్తున్న ఆ ఒంటరినీలిగులాబీ పువ్వే నిశ్చయంగా ఆమె ఆశ్చర్యానికి కారణం.

ఆ పువ్వు సూదంటురాయిలా ఆక ర్షిస్తూ వుంటే, తన అయిశ్వర్యాన్ని, హోదాని, కాన్వెంటు చదువుల్నీ క్షణ కాలం మర్చిపోయి, సౌందర్య సంకేతంలా నిలబడ్డ గులాబీ మొక్కముందు - అసంకల్పి తంగా - ఒదిగిపోతూ, తన్మయీ భావంతో నిలబడిందా అమ్మాయి.

తడక చాటునుండి యీ అపూర్వదృ శ్యాన్ని చూస్తున్న దాలి యిక నిగ్రహించు కోలేక బయటికి వచ్చింది. వచ్చి తాదా త్మ్యంతో తన మొక్కని, దాని ముందు ఒదిగి నిలబడ్డ శ్రీమంతులయింటి బిడ్డనీ వీక్షించింది.

ఎవరో వచ్చినట్టు అనిపించగానే ధ్యాన భంగమయింది చౌదరిగారి అమ్మాయికి. ఆమె దృష్టి గులాబీ మీంచి, దాలి దేసగా మళ్లింది. ఆమె మరోసారి దిగ్భ్రాంతికి లోనయ్యింది. ఊపిరిని కూడా పీల్చు కోడం మర్చిపోయినట్టు, తదేకంగా దాలిని చూస్తూ, పరవశించిపోతూ కొన్ని క్షణాలు అలా నిలబడిపోయింది. తరవాత, ఆమెలో కలిగిన స్పందన, ప్రశంసరూపంలో యిలా బయట పడింది. "హౌ వెరీ బ్యూటిఫుల్ యూ ఆర్!" (How Very beautiful you are!) అని.

ఒక దాని వెంట ఒకటిగా సంభవిం చిన యీ అనుభూతుల సుషుప్తి నుండి బయట పడుతూనే ఆలోచనా ప్రవంతి లోకి జారుకుంది అమ్మాయి. "ఏ మైఖేలేం జిలో (Michael Angelo) సృష్టించిన మహా సౌందర్య శిల్పంలా మెరిసిపోతున్న అందా లరాసి యీ గుడిసెలోనా? పేరడైజ్‌లో వికసించిన పువ్వులాకనిపిస్తున్న యీ నీలిగు లాబీ యీ మట్టి అరుగుమీదనా? వీటితో సరితూగే అందమయిన వస్తువు ఒక్కటీ మా బంగళాలో లేదే! What's This absurdity? (వాట్స్ దిస్ అబ్సర్డిటీ)? యిలా సాగింది అమ్మాయిలో అంతరంగ మధనం.

అయితే యీ అంతరంగ మధనం ఆమెకి కావలసిన సమాధానం యివ్వలేదు సరికదా, ఎక్కడో యేదో పొరపాటు జరిగిందనే తీవ్రమయిన అసంతృప్తిని కలి గించింది. ఈ భావం రాగానే గిరుక్కున వెనక్కి తిరిగి, చరచరా వెళ్లి కార్లో కూర్చుని 'పోనియ్' అంది డోర్‌వేసి, కారు స్టార్ట్ చెయ్యడానికి డ్రైవర్‌కి బహుశా చాలా కొద్దికాలమే పట్టివుండవచ్చును కాని ఆ కొద్ది క్షణాల కాలంలోనే అమ్మాయి కన్నుల్లో కది లిన నీలినీడ, సూచనామాత్రమైన నీటిపొర. దాలి దృష్టిలో పడనే పడ్డాయి."

అయిశ్వర్యం మీద అందం సాధిం చిన విజయగర్వం దాలి మనస్సులో ఒక నీచిక మాదిరి లేచి, ఆమె లేత పెద వుల మీద విరబూసిన చిరునవ్వు రూపంలో బయటపడింది.

హాయిలుగా ముందుకు నడిచి, నీలి గులాబీని తెంపి, కొప్పులో తురుము కుంటూ, "బయల్దేరయ్యా!" అని ఏదో అవ్యక్తానందంతో ముందుకు సాగిపోతున్న కూతురు అర్థంకాక తెల్లబోవడం కోనారి వంతయింది.